క్లుప్తంగా

క్రీడల్లో ప్రావీణ్యం పెంపొందించుకోవాలి

కోడూరు: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా ప్రావీణ్యం పెంపొందించుకోవాలని స్వతంత్రపురం జెడ్పీ పాఠశాల హెచ్ఎం ఆలా వెంకటరమణ అన్నారు. జాతీయ విద్యా విధానం ప్రారంభించి నాలుగు సంవత్సరాలు గడిచిన సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ఆదేశాలతో బుధవారం విద్యాశాఖ ఆధ్వర్యంలో 'శిక్షా సప్తాహ్'కార్యక్రమాన్ని నిర్వహించారు. మూడు రోజుల పాటు క్రీడల్లో నైపుణ్యం కలిగిన వారితో విద్యార్థులకు అవగాహన కల్పించనున్నట్లు వెంకటరమణ తెలిపారు. ఇందులో భాగంగా విద్యార్థులకు పలు ఆటల పోటీలను ప్రారంభించారు. బాలురు, బాలికలకు వేరువేరుగా పోటీలు జరిపి, ప్రతిభ కనబర్చినవారికి బహుమతులు అందించనున్నట్లు వెంకటరమణ చెప్పారు. కార్యక్రమంలో వివిధ పార్టీల రాజకీయ నేతలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సర్ ఆర్థర్ కాటన్‌కు ఘన నివాళి



మోపిదేవి: ఆంధ్ర ప్రదేశ్‌ను అన్నపూర్ణగా, దక్షిణ భారతదేశ ధాన్యాగారంగా తీర్చిదిద్దిన రూపశిల్పి సర్ ఆర్థర్ కాటన్ అని పలువురు నాయకులు కొనియాడారు. కాటన్‌దొర 125వ వర్ధంతి సందర్భంగా మోపిదేవి వార్పు వద్ద కాటన్ దొర విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కృష్ణానదిపై అక్విడెక్టు నిర్మించి దిగువ ప్రాంతాలకు సాగు, తాగు నీరు అందించిన మహనీయుడని కొనియాడారు.

వృద్ధులకు అన్నదానం



పెడన: పట్టణంలోని అమ్మ ఫుడ్ ఫౌండేషన్‌లోని వృద్ధులకు బుధవారం పట్టణానికి చెందిన కూనపురెడ్డి వెంకటేశ్వరరావు, వెంకట ధనలక్ష్మి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. వెంకటేశ్వరరావు తన తల్లి సుశీల, సోదరి సూదాబత్తుల ధనలక్ష్మి జ్ఞాపకార్థం ఆశ్రమంలో వృద్ధులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆటల పోటీలు



గూడూరు: విద్యావారోత్సవాలను పురస్కరించుకుని మండలంలోని వివిధ పాఠశాలల్లో బుధవారం క్రీడా దినోత్సవం నిర్వహించారు. దీనిలో భాగంగా సోమవారం పలు పాఠశాలల్లో విద్యార్థులకు ఆటల పోటీలు ఏర్పాటు చేశారు. మండలంలోని ముక్కొల్లు, కప్పలదొడ్డి, కంకటావ గ్రామాల్లో జరిగిన ఆటల పోటీలలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. భారతీయ సంప్రదాయానికి చెందిన తొక్కుడుబిళ్ల, ఏడుపెంకులాట తదితర ఆటల పోటీలు జరిగాయి. కంకటావలో జరిగిన పోటీలలో సర్పంచి మద్దాల మోహనరావు ఏడుపెంకులాట ఆడి విద్యార్థులను ఉత్సాహపరిచారు.

నేడు నగరంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

మచిలీపట్నంటౌన్: నగరంలో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాల్లో గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ మచిలీపట్నం డివిజన్ ఈఈ ఎం.భాస్కరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 నుంచి 9 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. బస్టాండ్ ఏరియా, రాజా గారి సెంటర్, రుస్తుంబాద, చెమ్మనగిరిపేట, చింతగుంటపాలెం, కాలేఖాన్ పేట, దేశాయిపేట, సుకర్లాబాద్, ఇంగ్లిష్ పాలెం, బచ్చుపేట, రామానాయుడు పేట, పరాసుపేట ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని తెలిపారు. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని ఆయన కోరారు.

అధికారుల అలసత్వం- రైతులకు శాపం

మండల పరిధిలోని నాగేశ్వరరావుపేట-పెందుర్రు మైనర్ డ్రైన్ ఆక్రమణలతో పాటు అక్రమ నిర్మాణాల కారణంగా మరమ్మతులకు నోచుకోవడం లేదు. తత్ఫలితంగా వందలాది ఎకరాలు ముంపునకు గురవుతున్నాయి. ఆక్రమణదారుల స్వార్థం..అధికారుల అలసత్వం రైతుల పాలిట శాపంగా మారింది.

- ఆక్రమణలో నాగేశ్వరరావుపేట మైనర్ డ్రైన్
- వర్షపు నీటిలో పంట పొలాలు
- జలదిగ్బంధంలో కేవీఆర్‌బీసీ కాలనీవాసులు



వర్షాలకు చెరువులను తలపిస్తున్న నాగేశ్వరరావుపేట మైనర్ డ్రెయిన్ పరిధిలోని పంట పొలాలు



కంపచెట్లు, జమ్ము తదితర అడ్డంకులు, ఆక్రమణలతో నాగేశ్వరరావుపేట-పెందుర్రు మైనర్ డ్రెయిన్

బంటుమిల్లి: నాగేశ్వరరావుపేట-పెందుర్రు మైనర్ డ్రైన్‌పై నాగేశ్వరరావుపేట, బందకోడు, బంటుమిల్లి మైనర్ డ్రైన్లతోపాటు చిన్న,చిన్న మురుగు బోదెలు ఆధారపడి ఉన్నాయి. పంట పొలాలతో పాటు, బంటుమిల్లి గ్రామం, కాలనీల్లోని మురుగు నీరంతా ఈ డ్రైన్ల గుండానే ప్రవహించి పెందుర్రు మీడియం డ్రైన్ ద్వారా ఉప్పుటేరులో కలుస్తుంది. ఈ క్రమంలో సంవత్సరాల తరబడి డ్రైనేజీ అధికారులు పట్టించుకోకపోవడంతో డ్రైన్ ఆద్యంతం ఆక్రమణలకు గురై అక్రమ నిర్మాణాలు పెద్ద ఎత్తున జరిగాయి. దీంతో డ్రైన్‌లో పూడిక, కంప చెట్లు, జమ్ము తదితర అడ్డంకులు తొలగించే సౌకర్యం లేకుండా పోయింది. ఈ కారణంగా డ్రైన్ పూడిపోయి నీటి ప్రవాహానికి పెద్ద ఎత్తున ఆటంకం ఏర్పడింది. మేజరు పంచాయతీ అయిన బంటుమిల్లి గ్రామంలోని అంతర్గత మురుగుతో పాటు వర్షపు నీరు కూడా ఈ డ్రైన్ గుండానే బయటకు వెళ్లాల్సి ఉంది. గ్రామం చుట్టూ డ్రైన్లు ఉన్నా అధ్వానంగా ఉండటంతో గ్రామంలో వర్షపు నీరు ఎక్కడికక్కడే నిలిచి వాహనదారులను, పాద చారులను ఇబ్బందులు పెడుతోంది.

నీటిలో నానుతున్న పంట పొలాలు

నాగేశ్వరరావుపేట-పెందుర్రు మైనర్ డ్రైన్‌లో ఏర్పడ్డ అడ్డంకుల కారణంగా పలు డ్రైన్ల పరిధిలోని వందలాది ఎకరాల పంట పొలాలు నీటిలో నానుతున్నాయి. గత కొద్ది రోజులుగా తుపాను ప్రభావానికి కురుస్తున్న వర్షాలకు పంట పొలాల్లోని మురుగు నీరు బయటకు వెళ్లే మార్గం లేక ఎక్కడివక్కడే నిలిచిపోయాయి. నాగేశ్వరరావుపేట, బందకోడు, బంటుమిల్లి మైనర్ డ్రైన్లలో తూడు, చెత్త, చెదారాలకు తోడు వీటిపై ఆధారపడ్డ పెందుర్రు డ్రైన్‌లో నీటి ప్రవాహం లేక నీరు బయటకు వెళ్లడం లేదు. దీంతో ఎగువన వందలాది ఎకరాల్లో నుంచి వస్తున్న వర్షపునీరు పంట పొలాల్లో నిలిచి చెరువలను తలపిస్తోంది.

జలదిగ్బంధంలో బీసీ కాలనీ

నాగేశ్వరరావుపేట మైనర్ డ్రైన్‌ను ఆనుకుని ఉన్న కేవీఆర్ బీసీ కాలనీలో వర్షపు నీరు చుట్టూ చేరడంతో జలదిగ్బంధంలో చిక్కుకుంది. తూడు, గుర్రపు డెక్క తదితర అడ్డంకులతో నీటి ప్రవాహం పూర్తిగా పారక పోవడంతో కాలనీ చుట్టూ చేరిన నీరు సమీపంలోని మైనర్ డ్రైన్‌లోకి వెళ్లడంలేదు. దీంతో కాలనీలోని ఖాళీ స్థలాలతో పాటు చుట్టూ నీరు చేరడంతో విష పురుగులు ఇళ్లలోకి వస్తున్నాయని కాలనీవాసులు ఆందోళన చెందుతున్నారు. కాలనీ ఏర్పాటు చేసి దాదాపు 8 సంవత్సరాలు అవుతున్నా మురుగునీటి సమస్య పరిష్కారం కాక వర్షాకాలం వస్తుంది అంటే భయంగా ఉందని కాలనీవాసులు విచారం వ్యక్తం చేస్తున్నారు.

డ్రైన్ల మరమ్మతులకు టెండర్లు పిలిచాం

–వి నాగేశ్వరరావు, డ్రైనేజీ ఏఈ, బంటుమిల్లి

మండల పరిధిలోని మీడియం, మైనర్ డ్రైన్ల మరమ్మతులకు, అడ్డంకుల తొలగింపునకు ప్రభుత్వం టెండర్లు పిలిచింది. విజయవాడకు చెందిన వ్యక్తితో అగ్రిమెంటు పూర్తికాగానే యుద్ధ ప్రాతిపదికన ప్రాధాన్యతను బట్టి డ్రైన్లు పూడిక, అడ్డంకులు తీయించి రైతులు ఇబ్బందులు పడకుండా, పంటలు నష్టపోకుండా చర్యలు తీసుకుంటాం.

డ్రైన్లు మరమ్మతులు చేయాలి



మండల పరిధిలో ఉన్న మీడియం, మైనర్ డ్రైన్లన్నీ మరమ్మతులు చేయాలి. ఈ మేరకు ఇటీవల జిల్లా కలెక్టరుకు వినతిపత్రం ఇచ్చాము. డ్రైన్లు మరమ్మతులు చేయకపోవడంతో వందలాది ఎకరాల పంటలు నీట మునిగాయి. యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేయించి రైతులను ఆదుకోవాలి.

–గౌరిశెట్టి నాగేశ్వరరావు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి

ఇంటి పన్నులపై డోర్ టు డోర్ సర్వే

- ఇంటి పన్నులు కట్టని గృహాలు.. దుకాణాలు 2వేల వరకు ఉన్నాయి
- మున్సిపల్ సిబ్బందికి పురప్రజలు సహకరించాలని కమిషనర్ వినతి



నూతనంగా నిర్మించిన దుకాణానికి కొలతలు వేయిస్తున్న కమిషనర్ వెంకటరామయ్య

పెడన: పురపాలక సంఘ పరిధిలో ఇళ్లు, దుకాణాలకు సంబంధించి మున్సిపాలిటీకి కట్టాల్సిన పన్నులు కట్టకుండా సుమారు 2వేల వరకు ఉండటంతో వాటిపై మున్సిపల్ అధికారులు బుధవారం నుంచి సర్వే ప్రారంభించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలతో కమిషనర్ బి.వెంకటరామయ్య వార్డు సచివాలయాలకు చెందిన ప్లానింగ్ కార్యదర్శులు, మహిళా పోలీసులు, మున్సిపల్ సిబ్బందిని బృందాలుగా చేసి ఆయా వార్డులలో డోర్ టు డోర్ సర్వే చేసేలా చర్యలు తీసుకున్నారు. కొన్ని చోట్ల పాత ఇళ్ల స్థానాల్లో కొత్త ఇళ్లు నిర్మించుకున్నప్పటికీ పాత పన్నులు కడుతున్నారని, ఇటువంటి వాటిని కూడా గుర్తించి తిరిగి కొలతలు వేసి నివేదికలను తనకు అందజేయాల్సిందిగా కమిషనర్ సిబ్బందిని ఆదేశించారు. పురప్రజలు కూడా పురపాలక సంఘానికి తప్పనిసరిగా పన్ను కట్టాలని, కట్టకుండా ఉంటే శాఖాపరమైన చర్యలకు ఉపక్రమించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఆ పరిస్థితి రాకుండా పన్నులు కట్టకుండా ఉన్న గృహస్తులు ఎవరైనా స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తమ ఇళ్లకు పన్నులు వేయించుకుని క్రమం తప్పకుండా మున్సిపాలిటీకి చెల్లించాల్సిన పన్నులను చెల్లించాలని కమిషనర్ సూచించారు.

శ్రీభ్రమరాంబ తల్లికి వైభవంగా ఆషాఢ సారె



నాగాయలంకలో భ్రమరాంబ అమ్మవారికి ఆషాఢపు సారె తీసుకొచ్చిన గ్రామస్తులు



బందరులో కన్యకా పరమేశ్వరి అమ్మవారికి సారె అందజేస్తున్న వాసవి క్లబ్ ప్రతినిధులు

టి.కొత్తపాలెం(నాగాయలంక): ఆషాఢమాసం ఆఖరివారం పురస్కరించుకుని గ్రామంలోని పురాతనమైన శ్రీభ్రమరాంబ సమేత శ్రీమల్లేశ్వరస్వామి దేవస్థానంలో బుధవారం గ్రామస్తులు, భక్త సమాజాలు, భజన బృందాల ఆధ్వర్యంలో అమ్మవారికి ఆషాఢపు సారె సమర్పణ పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బ్రహ్మశ్రీ అంబా సాయికిరణ్ శర్మ బ్రహ్మత్వంలో శ్రీభ్రమరాంబకు ఆషాఢపు సారె కార్యక్రమాన్ని సంప్రదాయబద్ధంగా జరిపారు. టి.కొత్తపాలెం, తలగడదీవి పరిసర గ్రామాల ప్రజలు ఈ ఉత్సవంలో అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని పూజలు చేసారు. స్త్రీలు సారె పళ్లాలు, మగవారు సారె కావళ్లతో వచ్చారు. ఈ సందర్భంగా తొలుత గ్రామదేవత గంగానమ్మ, గణపేశ్వరంలో కనకదుర్గమ్మను దర్శించుకుని పూజలు జరిపారు. వేడుక పురస్కరించుకుని అమ్మవారు, అయ్యవార్లను సుందరంగా అలంకరించారు. గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

వాసవి క్లబ్ ఆధ్వర్యంలో...

మచిలీపట్నంటౌన్: వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో బుధవారం క్లబ్ మహిళా ప్రతినిధులు నగరంలోని శ్రీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవార్లకు ఆషాఢ మాస సారె సమర్పించారు. క్లబ్ రీజనల్ చైర్మన్ శ్రీకాకుళపు రేణుకా రాణి, రీజనల్ కార్యదర్శి వేముల శిరీషతో పాటు మహిళా ప్రతినిధులు ఆలయంలో కొలువై ఉన్న కన్యకా పరమేశ్వరి, పార్వతీ దేవి అమ్మవార్లకు సారెను సమర్పించారు. ఈ సందర్భంగా శ్రీకాకుళపు నరసింహ గుప్తా- రేణుకారాణి, వేముల కృష్ణ- శిరీష దంపతులను క్లబ్ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు.



బందరు బలరామునిపేటలో...

బలరామునిపేటలో...

నగరంలోని బలరామునిపేటలో ఉన్న శ్రీ కోదండరామస్వామి ఆలయంలో సీతమ్మ తల్లికి భక్తులు బుధవారం ఆషాఢ మాస సారెను సమర్పించారు. పూలు, పండ్లు, స్వీట్లు, పసుపు, కుంకుమ, జాకెట్ ముక్కలు, నూతన వస్త్రాలను మహిళలు పురవీధుల గుండా ఊరేగిస్తూ ఆలయానికి చేరుకున్నారు. అనంతరం సారెను అమ్మవారికి అందజేశారు. ఈ కార్యక్రమాన్ని ఆలయ పునర్నిర్మాణ కమిటీ అధ్యక్షుడు పిల్లారిశెట్టి శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

ప్రజల వద్దకు తపాలా సేవలు



పోస్టల్ పథకాలను ప్రజలకు వివరిస్తున్న సూపరింటెండెంట్ ఆదినారాయణ

మచిలీపట్నంటౌన్: భారత ప్రభుత్వ సంస్థ తపాలా శాఖ అందిస్తున్న సేవలను ప్రజలకు మరింత విస్తృతంగా అందించేందుకు ఉద్యోగులు ఇంటింటికీ వెళ్లి పథకాలు వివరించే కార్యక్రమంలో భాగంగా మచిలీపట్నంలో బుధవారం హెడ్ పోస్ట్ ఆఫీస్ ప్రధాన ద్వారం వద్ద నుంచి ర్యాలీ నిర్వహించారు. పోస్టల్ శాఖ మచిలీపట్నం డివిజన్ సూపరింటెండెంట్ కత్తి ఆదినారాయణ ఈ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. పోస్టల్ శాఖ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా వంద రోజుల పాటు మన పోస్ట్ ఆఫీస్.. ఇప్పుడు ప్రతి గడపలో... అనే నినాదంతో కార్యక్రమం నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా మచిలీపట్నంలో ఈ కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డివిజన్ సూపరింటెండెంట్ ఆదినారాయణ పోస్టల్ శాఖ ద్వారా అందిస్తున్న సేవల వివరాలను ప్రజలకు వివరించారు. పోస్టల్ శాఖ అమలు చేస్తున్న జీవిత బీమా ప్రీమియంల వివరాలను వెల్లడించారు. కార్యక్రమంలో పోస్టల్ శాఖ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

హార్మోన్‌పాస్టర్ ఫెలోషిప్‌కు రూ.లక్ష విరాళం



మోపిదేవిలో పాస్టర్స్ అసోసియేషన్‌కు రూ.లక్ష చెక్కును అందిస్తున్న శ్రీనివాసరావు

మోపిదేవి: మండల హార్మోన్ పాస్టర్ ఫెలోషిప్ అభివృద్ధికి టీఆర్ఎస్ గ్రూప్ చైర్మన్, టీఆర్ఎస్ మూవీ మేకర్స్ అధినేత తిరుపతి శ్రీనివాసరావు లక్ష రూపాయలను విరాళంగా అందజేశారు. మండల కేంద్రమైన మోపిదేవిలో బుధవారం పాస్టర్ ఫెలోషిప్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన శ్రీనివాసరావు మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల ముందు నియోజకవర్గంలోని ఆరు మండలాల వాక్యోపదేశకులు అందరూ ఒక అసోసియేషన్‌గా ఏర్పడితే ఆ అసోసియేషన్‌కు రూ.లక్ష అందిస్తానని హామీ ఇచ్చానని, ఆ హామీ మేరకు ఈ చెక్కును స్థానిక ఎస్ఐ వైవీవీ సత్యనారాయణ చేతుల మీదగా అందజేస్తున్నట్టు వివరించారు. అనంతరం శ్రీనివాసరావును అసోసియేషన్ తరపున ఘనంగా సన్మానించారు.

నిబంధనలు అతిక్రమిస్తున్నా పట్టదా!


- మాస్టర్ ప్లాన్‌కు విరుద్ధంగా నిర్మాణం
- కన్నెత్తి చూడని టౌన్ ప్లానింగ్ విభాగం



కెనడి రోడ్ లో నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న దుకాణం

మచిలీపట్నంటౌన్: నగరంలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు జరుగుతున్నా నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. తాజాగా స్థానిక కెనడీ రోడ్‌లో ఆర్కే జూనియర్ కళాశాల ఎదురుగా దుకాణం నిర్మిస్తున్నా పట్టించుకోని వైనం వెలుగులోకి వచ్చింది. మాస్టర్ ప్లాన్ ప్రకారం రోడ్డు 80 అడుగులుగా ఉంది. ఈ రోడ్‌లో 80 అడుగులు వదిలి లోపలికి నిర్మాణాలు చేపట్టాల్సి ఉంది. గత ప్రభుత్వ హయాంలో ఈ నిబంధనను కఠినంగా అమలు చేశారు. కానీ ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చిన అనంతరం నగరంలో అధికార పార్టీ నాయకుల అండదండలతో కొంతమంది నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడుతున్నారు. రోడ్డు మార్జిన్లో చిరు వ్యాపారులు ఏర్పాటు చేసుకున్న తాత్కాలిక దుకాణాలను తొలగిస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారులు నిబంధనలకు విరుద్ధంగా పక్కా నిర్మాణాలు చేస్తున్నా పట్టించుకోవడం లేదనే విమర్శలు ప్రజల నుంచి వినవస్తున్నాయి. ఇప్పటికైనా టౌన్ ప్లానింగ్ అధికారులు వీటిపై దృష్టి సారించి నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న నిర్మాణాలను అడ్డుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

స్వచ్ఛ సుందర చల్లపల్లి ద్వారా 27వేల మొక్కలు



216వ నంబరు జాతీయ రహదారి పక్కన మొక్కలు నాటుతున్న డాక్టర్ డీఆర్‌కే ప్రసాద్, డాక్టర్ పద్మావతి


చల్లపల్లి(అవనిగడ్డ): స్వచ్ఛ సుందర చల్లపల్లి కార్యక్రమం ద్వారా చల్లపల్లి పరిసర ప్రాంతాల్లో 27 వేల మొక్కలు నాటినట్టు స్వచ్ఛ చల్లపల్లి కన్వీనర్ డాక్టర్ డీఆర్కే ప్రసాద్ చెప్పారు. స్థానిక పంచాయతీ పరిధిలోని 216 జాతీయ రహదారికి ఇరువైపులా మొక్కలు నాటే కార్యక్రమాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2015లో ప్రారంభించిన ఈ కార్యక్రమం ద్వారా వేలాది మొక్కలు నాటి వాటిని సంరక్షించినట్టు చెప్పారు. ఈ వర్షాకాలంలో విస్తృతంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టనున్నట్టు తెలిపారు. ఈ బృహత్తర కార్యక్రమంలో స్వచ్ఛ సుందర చల్లపల్లి కార్యకర్తల సేవలు ఆదర్శనీయమన్నారు. స్వచ్ఛసుందర చల్లపల్లి కన్వీనర్ డాక్టర్ పద్మావతితో పాటు పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ సాగుపై రైతులకు అవగాహన



ఉత్తరచిరువోలులంక(మోపిదేవి): ప్రభుత్వం నూతనంగా ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహిస్తోందని, ఈ సాగును రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఉద్యాన అధికారి ఎస్.రమేష్ సూచించారు. మండల పరిధిలోని ఉత్తర చిరువోలులంకలో ఆయిల్ పామ్ సాగుపై బుధవారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక హెక్టారుకు 143 మొక్కలు వేసుకోవాలని, దేశవాళీ మొక్కలకు రూ.20 వేలు, విదేశీ మొక్కలకు రూ.29 వేలు ప్రభుత్వం సబ్సిడీ అందించనున్నట్లు తెలిపారు. అంతర పంటలుగా పసుపు, కూరగాయలు, పూలతోటలు పెంచుకోవచ్చునని తెలిపారు. ఆయిల్ కంపెనీ ప్రతినిధి, గ్రామ వ్యవసాయ సహాయకులు రాజశేఖర్, పలువురు రైతులు పాల్గొన్నారు.

సరసమైన ధరలకే బియ్యం, కందిపప్పు



కోడూరు: ప్రభుత్వ ఆదేశాలతో కోడూరులోని ఓ దుకాణంలో సరసమైన ధరకే బియ్యం, కందిపప్పును ప్రజలకు అందిస్తున్నట్టు తహసీల్దార్ శ్రీనివాసరావు తెలిపారు. కోడూరు ప్రధాన సెంటర్‌లోని తూనుగుంట్ల శ్రీధర్‌కు చెందిన లక్ష్మీ గాయత్రి జనరల్ స్టోర్స్‌లో ప్రభుత్వం నిర్దేశించిన రేట్లతో బుధవారం విక్రయాలను ప్రారంభించారు. స్టీమ్ బియ్యాన్ని కేజీ రూ.49కు, బీపీటీ బియ్యాన్ని కేజీ రూ.48కు, కేజీ కందిపప్పును రూ.160కు ఈ దుకాణంలో విక్రయిస్తారని తహసీల్దార్ తెలిపారు. ప్రజలు వీటిని సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ కోరారు. డీటీ పద్మప్రియ, ఆర్ఐ సుభాషిణి, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

దుర్గమ్మకు నృత్య నీరాజనాలు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు ఖతర్ నుంచి విచ్చేసిన పలువురు కళాకారులు నృత్య నీరాజనాలను అర్పించారు. ఖతర్‌కు చెందిన ఆంధ్ర నాట్య వేదికకు చెందిన పలువురు చిన్నారులు దుర్గమ్మ సన్నిధిలో భరతనాట్య ప్రదర్శన ఇచ్చారు. అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం చిన్నారులు నృత్య ప్రదర్శన చేశారు. భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. పలు కీర్తనలకు లయబద్ధంగా నాట్యాన్ని ప్రదర్శించారు. అనంతరం కళాబృందంలోని సభ్యులకు అమ్మవారి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలను అందజేశారు.

క్రీడలపై విద్యార్థులకు అవగాహన

శ్రీకాకుళం(ఘంటసాల): క్రీడల్లో పాల్గొనడం ద్వారా విద్యార్థులకు శారీరక దారుఢ్యం, ఆత్మవిశ్వాసం పెంపొందుతాయని ఎంఈవో 2 మోమిన్ అన్నారు. మండల పరిధిలోని శ్రీకాకుళం జెడ్పీహెచ్ఎస్ ప్లస్ 2 ని ఎంఈవో బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా క్రీడా దినోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సెల్‌ఫోన్‌లు, ఆన్‌లైన్ గేమ్‌లకు బానిసలు కావడం వల్ల ఎన్నో నష్టాలు, ఇబ్బందులు ఎదుర్కొంటారని, అదే క్రీడల్లో పాల్గొనడం వల్ల మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్ఎం వీర కోటేశ్వరరావు, వ్యాయామ ఉపాధ్యాయుడు బడే వెంకటేశ్వరరావుతో పాటు పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శిక్షా సప్తాహ్ వారోత్సవాలు




చినగొల్లపాలెం ఏటిమొండి పాఠశాలలో శిక్షాసప్తాహ్ కార్యక్రమంలో ఎంఈఓ, ఉపాధ్యాయులు, ఆశ, అంగన్‌వాడీలు

కృత్తివెన్ను: కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జాతీయ విద్యా విధానం 2020 ప్రవేశపెట్టి నాలుగేళ్లు అయిన సందర్భంగా ఈ నెల 28వ తేదీ వరకు శిక్షాసప్తాహ్ పేరుతో ప్రభుత్వ పాఠశాలల్లో వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు మండల విద్యాశాఖాధికారి ప్రసాదరావు తెలిపారు. రోజువారీ కార్యక్రమాలలో భాగంగా బుధవారం క్రీడా దినోత్సవాన్ని నిర్వహించారు. దీనిలో భారతీయ సంప్రదాయానికి సంబంధించిన ఆటల పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమాలను ఎంఈవో ప్రసాదరావు పర్యవేక్షించారు. చినగొల్లపాలెం ఏటిమొండి పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఇందిర, పురుషోత్తం, బాలు, ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక బడ్జెట్

కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా సీపీఎం ధర్నా



మచిలీపట్నం టౌన్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజా వ్యతిరేకంగా, బడా వ్యాపారులకు అనుకూలంగా ఉందని సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు అన్నారు. ఆ పార్టీ నగర కమిటీ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక కోనేరు సెంటర్‌లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను నిరసిస్తూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీకి ప్రత్యేక హోదా, రాజధాని నిర్మాణం, విభజన హామీల విషయంలో ఆంధ్ర రాష్ట్రానికి మాటలతో సరిపెట్టిందని అన్నారు. రాజధాని అమరావతికి రూ.15 వేల కోట్లు పలు ఆర్థిక సంస్థల ద్వారా అప్పుగా ఇప్పిస్తామన్నారని, రాష్ట్రానికి ఆ నిధులను గ్రాంట్‌గా ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్రానికి ఈ బడ్జెట్‌లోనూ ఆశించిన రీతిలో కేటాయింపులు లేవని అన్నారు. కార్యక్రమంలో సీపీఎం సీనియర్ నాయకుడు కొడాలి శర్మ, జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మాదాల వెంకటేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యుడు సీహెచ్ రాజేష్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు కె.వి.గోపాలరావు, మద్రపు పోలినాయుడు, ఎన్‌పీఆర్‌డీ జిల్లా కార్యదర్శి ఎన్.ఎస్.నారాయణ, ఎల్ఐసి ఏజెంట్ల ఆర్గనైజేషన్ జోనల్ నాయకుడు కె.రాజారావు, ఐద్వా నగర కార్యదర్శి కె.సుజాత, జిల్లా కమిటీ సభ్యురాలు పి.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.